# తగ్గిన ఓటింగ్ శాతం

- నేడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు
- కౌంటింగ్ కేంద్రాలకు వెళ్లనున్న నేతలు
- గులాబీ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

వేములవాడ, డిసెంబర్ 3:వేములవాడ నియోజకవర్గంలో 2018 ఎన్నికలతో పోల్చితే ఓటింగ్ శాతం తగ్గింది. గతంలో 80.24 శాతం రికార్డు కాగా, ఈ ఎన్నికల్లో 78.43 శాతం ఓటింగ్ నమోదైంది. ఆదివారం ఫలితాలు వెల్లడి కానున్న నేపథ్యంలో విజయంపై బీఆర్ఎస్ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. అసెంబ్లీ నియోజకవర్గం ఏర్పడిన నాటి నుంచి వేములవాడ ఓటర్లు ఎమ్మెల్యేగా ఎన్నుకునే విషయంలో విభిన్నమైన తీర్పునిచ్చారు. స్వరాష్ట్రంలో మాత్రం రెండుసార్లు అధికార పార్టీ అభ్యర్థికే జైకొట్టారు. ఇక 2009లో నియోజకవర్గాల పునర్విభజన తర్వాత వేములవాడ నియోజకవర్గం ఏర్పడింది. 2009 లో అప్పటి మహాకూటమి అభ్యర్థిగా చెన్నమనేని రమేశ్ బాబు టీడీపీ నుంచి పోటీ చేసి అప్పటి కాంగ్రెస్ అభ్యర్థి ఆది శ్రీనివాస్‌పై 1823ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో భాగంగా అప్పటి కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం డిసెంబర్‌లో రాష్ట్రాన్ని ఇచ్చినట్టే ఇచ్చి వెనక్కి తీసుకోగా తెలంగాణ కోసం రాజీనామా చేసి 2010 ఉప ఎన్నికల్లో 50వేల మెజార్టీతో గెలుపొందారు. 2014 లో టీఆర్ఎస్ నుంచి రమేశ్ బాబు, బీజేపీ నుంచి ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ నుంచి బొమ్మ వెంకటేశ్వర్లు బరిలో నిలిచారు. అయితే ఆది శ్రీనివాస్ పై టీఆర్ఎస్ అభ్యర్థి రమేశ్ బాబు 5268 ఓట్లతో గెలుపొందారు. ఇక 2018 లోనూ చెన్నమనేని రమేశ్ బాబు కాంగ్రెస్ అభ్యర్థి ఆది శ్రీనివాస్‌పై 28 వేల 186 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. బీఆర్ఎస్ పార్టీ కంచుకోటగా ఉన్న వేములవాడ నియోజకవర్గంలో ప్రస్తుతం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా చల్మెడ లక్ష్మీనరసింహారావు మరోసారి కాంగ్రెస్ పార్టీపై విజయం తథ్యమని నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

**ఓటింగ్ సరళిపై అంచనాలు..**

వేములవాడ నియోజకవర్గంలోని ఓటర్ నాడిపై పార్టీలు అంచనా వేస్తూ గెలుపు పై ధీమా వ్యక్తం చేస్తున్నాయి. పది సంవత్సరాలు సీఎం కేసీఆర్ అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు కండ్ల ముందు కనిపించగా ప్రజలు బీఆర్ఎస్ పార్టీపై ఉన్నారని నాయకులు ధీమా వ్యక్తం చేస్తూ గెలుపు తమదే అంటున్నారు. ఇతర పార్టీలకు పడ్డ ఓట్లు లెక్కలు వేసుకున్న తర్వాత ఈ నిర్ణయానికి వచ్చినట్లు ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు.

**పెరిగిన ఓటర్లు**

2018 అసెంబ్లీ ఎన్నికల్లో లక్షా 92వేల, 669 మంది ఓటర్లు ఉండగా 80.24 శాతం ఓటింగ్ నమోదైంది. లక్షా 54వేల,595 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లో 2లక్షల 22వేల 251 మంది ఓటర్లు ఉండగా 78.43 శాతం ఓటింగ్ నమోదు కాగా 1లక్ష , 74వేల, 315 మంది ఓటేశారు. అయితే ఓ టింగ్ శాతం గతంలో కంటే తగ్గినా ఓటు హక్కు వినియోగించుకున్న ఓటర్ల సంఖ్య మాత్రం దాదాపు 20వేల మంది పెరిగారు.

# బీఆర్ఎస్ ఘన విజయం ఖాయం



మాట్లాడుతున్న కోడి అంతయ్య, బీఆర్ఎస్ నాయకులు

సిరిసిల్ల రూరల్, డిసెంబర్ 2: అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ ఘన విజయం ఖాయమని బీఆర్ఎస్ నాయకుడు, మాజీ జడ్పీటీసీ కోడి అంతయ్య ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్ మూడోసారి సీఎం కావడం తథ్యమని చెప్పారు. శనివారం తంగళ్లపల్లిలోని ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. సిరిసిల్లలో అభివృద్ధికి పట్టం కట్టబోతున్నారని, మంత్రి కేటీఆర్ భారీ మెజార్టీతో గెలుపొందుతారని చెప్పారు. ఫేక్ సర్వేలను నమ్మవద్దని కోరారు. ఎన్నికల్లో మద్యం, మనీ పంచకుండా పోటీ చేశారని, సర్వేలన్నీ తలకిందులుగా చేసి విజయకేతనం ఎగరవేయబోతున్నామన్నారు. సీఎంగా కేసీఆర్, మంత్రిగా కేటీఆర్ ప్రమాణ స్వీకారం చేస్తారని జోస్యం చెప్పారు. పార్టీ గెలుపునకు కృషి చేసిన నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. శ్రేణులు ఆదివారం సంబురాలకు సిద్ధం కావాలని సూచించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయులు శ్రీకాంత్, అనిల్, కనకరాజు, తదితరులు ఉన్నారు.

# అప్పుల భారంతో ఒకరి ఆత్మహత్య

కోనరావుపేట, డిసెంబర్ 2: అప్పుల భారంతో ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిరిసిల్లరూరల్ మండలంలోని చిన్న బోనాలకు చెందిన ముద్దం రాములు (60) గొర్రెలు, మేకల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో ఇద్దరు కూతుళ్లు, కుమారుడికి వివాహం చేశాడు. ఈ మధ్య కాలంలో వ్యాపారంలో తీవ్ర నష్టం రాగా రూ. 5లక్షల వరకు అప్పు చేశాడు. దీంతో అప్పులు తీరే దారిలేక శుక్రవారం భార్య నర్సవ్వకు బయటకు వెళ్లి వస్తానని ఇంటి నుండి వెళ్లిపోయాడు. కోనరావుపేట మండలంలోని కొలనూర్ గ్రామంలో గోస్కుల మధు తన వ్యవసాయక్షేత్రానికి వెళ్లగా అక్కడ చెట్టుకు వేలాడుతూ కనిపించినట్లు తెలిపారు. దీంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా అక్కడికి చేరుకున్న విగతజీవిగా ఉన్న భర్తను చూసి రోదించింది. ఎస్ఐ తాంజనేయులు ఘటనా స్థలానికి చే రుకుని మృతికి గల కారణాలు తెలుసుకుని, మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న ఎన్పీడీసీఎల్ ఎస్ఈ గంగాధర్

ముకరంపుర, డిసెంబర్ 2: ఉద్యోగుల సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని ఎన్పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ పేర్కొన్నారు. కరీంనగర్‌లోని సర్కిల్ కార్యాలయంలో శనివారం ఎంప్లాయిస్ గ్రీవెన్స్ డే నిర్వహించారు. సర్కిల్ కార్యాలయానికి మొత్తం ఆరు అప్లికేషన్లు రాగా ఐదింటిని తక్షణమే పరిష్కరించామని, ఒక అప్లికేషన్ వరంగల్ కార్యాలయానికి సంబంధించిందని పేర్కొన్నారు. ప్రతినెల మొదటి శనివారం ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నామని, ఎస్ఈ తో పాటు డీఈలు ఉద్యోగుల నుంచి వచ్చిన విజ్ఞప్తులను పరిశీలించి, సమస్యను వెంటనే పరిష్కరిస్తారని పేర్కొన్నారు. కరీంనగర్ టౌన్ డివిజన్ కార్యాలయానికి 12 దరఖాస్తులు రాగా రెండింటిని తక్షణమే పరిష్కరించారు. కరీంనగర్ రూరల్ డివిజన్ పరిధిలో నాలుగు, హుజూరాబాద్ డివిజన్ పరిధిలో మూడు దరఖాస్తులు రాగా మూడు రోజుల్లో పరిష్కరిస్తామని డీఈలు తిరుపతి, లక్ష్మీరెడ్డి తెలిపారు. డీఈలు రాజం, విజేందర్ రెడ్డి, ఎస్ఏవో రాజేశం, రాజేంద్రప్రసాద్, శ్రీహరి పాల్గొన్నారు.

# లాయర్ల సదస్సును జయప్రదం చేయాలి



వేములవాడలో బార్ అసోసియేషన్ ఆఫీసులో సదస్సు కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న న్యాయవాదులు

వేములవాడ, డిసెంబర్ 2: హైదరాబాద్‌లో జరిగే 3వ లాయర్ల జాతీయ సదస్సును విజయవంతం చేయాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పెంట రాజు కోరారు. శనివారం బార్‌అసోసియేషన్ కార్యాలయంలో కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ఈనెల 10న హైదరాబాద్‌లోనిమాసబ్ ట్యాంక్ జోహార్ నెహ్రూ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ ఆడిటోరియంలో సదస్సు జరగనుందని తెలిపారు. ఈ సదస్సుకు సుప్రీం కోర్టు రిటైర్డ్ న్యాయవాది జస్టిస్ సుదర్శన్‌రెడ్డి, రాష్ట్ర హై కోర్టు విశ్రాంత రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ ఈశ్వరయ్యతో పాటు పలువురు హాజరు కానున్న నేపథ్యంలో పెద్ద సంఖ్యలో న్యాయవాదులు తరలివెళ్లి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు నేరెళ్ల తిరుమల్‌గౌడ్, బొడ్డు గంగరాజు, పర్లపల్లి అంజయ్య, అనిల్‌కుమార్, నవీన్, మహేశ్ బాబు, నాగుల సంపత్, పొన్నం దేవరాజు, కృష్ణారెడ్డి, సుమలత, లక్ష్మి, సురేశ్, ప్రసాద్, తిరుపతి, నహీమానాసారి తదితరులు ఉన్నారు.

# తాళం వేసిన ఇంట్లో దొంగతనం



చిందరవందరగా పడిఉన్న వస్తువులు

వేములవాడ, డిసెంబర్ 2: వేములవాడ గాంధీనగర్‌లో తాళం వేసిన ఇంట్లో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న ఆంజనేయులు-స్వప్న దంపతులకు అసెంబ్లీ ఎన్నికల విధులకు వెళ్లారు. దీంతో విధులు ముగించుకొని శనివారం ఉదయం ఇంటికి చేరుకోవడంతో తాళం పగలగొట్టి ఇంట్లోని వస్తువులను చిందరవందరగా పడి ఉండడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంట్లోనే బీరువాలను పగలగొట్టి రూ. 40వేలు, నగలతో పాటు కొంత బంగారం అపహరణకు గురైందని బాధితులు వాపోయారు. పోలీస్ క్లూస్‌టీమ్ చేరుకొని ఆధారాలు సేకరిస్తుండగా సదరు అనుమానితుడి ఆనవాళ్లు అక్కడ ఉన్నటువంటి సీసీ ఫుటేజీలో నమోదు కాగా పోలీసులు విచారణ జరుపుతున్నారు.

# విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



సిద్ధార్థను అభినందిస్తున్న కరస్పాండెంట్

తెలంగాణ చౌక్, డిసెంబర్ 2: విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని సిద్ధార్థ స్కూల్ కరస్పాండెంట్ నాగుల సంతోష్ పిలుపునిచ్చారు. సిరిసిల్ల పట్టణంలోని సిద్ధార్థ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న నా గుల సిద్ధార్థ అనే విద్యార్థి రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక య్యాడు. శనివారం సదరు వి ద్యార్థిని ప్రత్యేకంగా అభినందించారు. ఉత్తమ ప్రతిభ చూపి జాతీయస్థాయికి ఎంపిక కవాలని ఆకాంక్షించారు. ఇక్కడ పాఠశాల క్రీడా కార్యదర్శి దేవత ప్రభాకర్, జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి రామదాసు, పాఠశాల హెచ్ఎం దేవన్న, మార్థిన్‌లూథర్, సుధాకర్ తదితరులు ఉన్నారు.

# ప్రమాదవశాత్తు గడ్డి వాహనంలో మంటలు

వేములవాడ, డిసెంబర్ 2: వేములవాడ పట్టణంలోని భగవంతరావు నగర్ లోని గోశాలకు డీసీఎం వ్యాన్ లో ఎండు గడ్డి తరలిస్తుండగా శనివారం ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. స్థానికుల సమాచారంతో హుటాహుటిన అగ్నిమాపక సిబ్బంది, పట్టణ సీఐ కరుణాకర్ చేరుకొని మంటలను ఆర్పివేశారు. అయితే వాహనంలో గడ్డి మోతాదు ఎక్కువగా ఉండడంతో విద్యుత్ తీగలు తగిలి మంటలు చెలరేగినట్లుగా స్థానికులు తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు అప్రమత్తం కావడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. వాహనంలోని గడ్డి ద్వారా దాదాపు రెండు గంటల పాటు దట్టమైన పొగతో కాలనీవాసులు ఉక్కిరి బిక్కిరి అయ్యారు.

## నేడు వైన్‌షాపులు బంద్

సిరిసిల్ల, డిసెంబర్ 02: అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ఆదివారం మద్యం దుకాణాలను మూసి వేయాలని సిరిసిల్ల ఎక్సైజ్ సిఐ గులాము ముస్తాఫా ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం నుంచి లెక్కింపు పూర్తయ్యేవరకు సిరిసిల్ల ఎక్సైజ్ పరిధిలోని మద్యం దుకాణాలు, బార్లు, కల్లు దుకాణాలు మూసి వేయాలని ఆదేశించారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## సంబురాలు జరుపుకోవద్దు

ఇల్లంతకుంట : డిసెంబర్ 2 : అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన వారు ఈ నెల 5వరకు సంబురాలు జరుపుకోవద్దని ఇల్లంతకుంట ఎస్ఐ దాస సుధాకర్ హెచ్చరించారు. డప్పుచప్పుళ్లతో ర్యాలీలకు ఎలాంటి అనుమతిలేదని చెప్పారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందునా ప్రతిఒక్కరూ నిబంధనలు పాటించాలని సూచించారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## నోట్స్ ఆవిష్కరణ

హౌసింగ్‌బోర్డుకాలనీ, డిసెంబర్ 2: నగరంలోని వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాలలో ఆంగ్ల అధ్యాపకుడు హమ్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు ధనపురి సాగర్ రూపొందించిన డిగ్రీ మూడో సెమిస్టర్ నోట్స్‌ను ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ అనంతం సీతారాంపూర్‌లోని తన నివాసంలో ఆవిష్కరించినట్లు సాగర్ తెలిపారు. సాగర్ మాట్లాడుతూ, తమ సంస్థ తరఫున నోట్స్ ఉచితంగా అందజేయడానికి ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. దూర ప్రాంత విద్యార్థులు వాట్సాప్ నంబర్ 8885549467లో సంప్రదిస్తే పీడీఎఫ్ రూపంలో పంపిస్తామన్నారు.

# ఎటూచూసినా ధాన్యపు రాశులే



కొనుగోలు కేంద్రంలో వడ్లను ఆరబోస్తున్న రైతులు

చందుర్తి, డిసెంబర్ 2: ఒకప్పుడు కరువు ప్రాం తంగా ఉన్న మెట్ట ప్రాంతం చందుర్తి మం డలం నేడు ధాన్యరాసులతో కళకళలాడుతుంది. ఎల్లంపల్లి, కాళేశ్వరం ప్రాజెక్టులు మిషన్ కాకతీయతో చెరువుల పునరుద్ధరణతో వరి సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. గతంలో మం డలం మొత్తం వెయ్యి ఎకరాల్లో వరి సాగయేది. కానీ నేడా పరిస్థితి మారింది. సుమారు పన్నెం డు వేల ఎకరాల్లో వరి సాగు అవుతుండగా సాగునీటికి ఢోకా లేదు. ఈ క్రమంలో ఎకరాన 45 బస్తాల దిగుబడి పొందుతుండగా ఎటు చూసినా ధాన్య రాసులే దర్శనమిస్తున్నాయి.